క్లుప్తంగా

సర్వీస్ వైరు స్తంభానికి ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



సర్వీస్ వైరును స్తంభానికి ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని గోకుల్ నగర్ నుంచి ఖబ్రస్తాన్‌కు వెళ్లే దారిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు మోటారుకు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైరును స్తంభానికి ఏర్పాటు చేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'తీగ ఊపితేనే బోరు నడుస్తది' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ విద్యుత్‌శాఖ సిబ్బందితో సర్వీస్ వైరును సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేయించారు. సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: ఉపాధిహామీ పనుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్ వద్ద డి–83 ప్రధాన కాలువలో సిల్టు తొలగింపు, జంగల్ కటింగ్ పనులను ఏపీవో సదానందంతో కలిసి పరిశీలించారు. నిబంధనల మేరకు కొలతలు పెట్టిన పనులు పూర్తి చేయాలని, అప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు జమవుతాయన్నారు. కార్యదర్శి ఖాజామొహనుద్దీన్ మహ్మద్, ఫీల్డ్ అసిస్టెంటు నర్సయ్య ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

పెద్దపల్లిరూరల్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని షీటీం సభ్యులు ఉపాధ్యాయులకు సూచించారు. పెద్దపల్లిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో షీటీం ఇన్‌చార్జి లావణ్య, తదితరులు మహిళల భద్రత, యాంటీ డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నేరాలకు గురయ్యామని భావిస్తే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సభ్యులు మౌనిక, సురేశ్, స్నేహలత, భరోసా కోఆర్డినేటర్ అశ్రిత, అస్మా, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్ గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం ఆవరణలో బుధవారం బసంత్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎస్సై స్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఎస్సై స్వామి మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగానే కుక్కలగూడుర్‌లో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు.

గీత కార్మికుడు అదృశ్యం



సమ్మయ్య

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన కాట సమ్మయ్య (55) అనే గీత కార్మికుడు ఈనెల 26 నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు అజయ్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మద్యం తాగి తాటి చెట్టు ఎక్కొద్దని సమ్మయ్యపై అతని కొడుకు కోపగించాడు. మనోవేదనకు గురైన సమ్మయ్య 26న రంగయ్యపల్లిలో తాటిచెట్లు ఎక్కడానికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. గొల్ల మల్లయ్య ఇంటి వద్ద మోకుతాడు, సామగ్రి పెట్టి మళ్లీ తిరిగి వస్తానని చెప్పి వెళ్లాడు. 27న మంథని బస్టాండ్ నుంచి భూపాలపల్లికి వెళ్లే బస్సు ఎక్కాడని కుమార్ అనే వ్యక్తి చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమ్మయ్య కనిపిస్తే అజయ్ సెల్ నంబర్ 82474 29765, లేదా ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలకు పునరుజ్జీవం

- ఉపాధి నిధులతో పూడికతీత, పునరుద్ధరణ పనులు
- ఖరీఫ్ సీజన్‌లో చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు



ఎస్సారెస్పీ కాలువలో చెత్తను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

రామగుండం: రానున్న వర్షాకాలం (ఖరీఫ్) సీజన్ నాటికి ఎస్సారెస్పీ కాలువల్లో వరద నీరు సాఫీగా సరఫరా జరగాలని, చివరి ఆయకట్టుకు సమృద్ధిగా వరద నీరు అందాలన్న ఉద్దేశంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధి హామీ నిధులతో కాలువల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అంతర్గాం మండల పరిధిలోని అన్ని గ్రామాల శివారుకు చేరే కాలువల పునరుద్ధరణ పనులను ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, రాళ్లు, పిచ్చి మొక్కలు, కూలిన లైనింగ్, ఫ్లోరింగ్, కాలువ వెంట గట్లపై ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు పనులు ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. ప్రస్తుతం అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామాల్లో 510 మంది ఉపాధి కూలీలు కాలువల పనుల్లో నిమగ్నమయ్యారు.

ఎస్సారెస్పీ ద్వారా సాగు నీటి సరఫరా

అంతర్గాం మండల పరిధిలోని ఎస్సారెస్పీ కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు రూ.1.53కోట్ల ఉపాధి నిధులు కేటాయించారు. కాగా ఈ నిధులతోనే కూలీలకు వేతనాలు, పునరుద్ధరణ పనులకు మెటీరియల్ వినియోగించనున్నారు. ఈ నిధులతో నీటి సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉన్న 12 ప్రదేశాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రధాన కాలువ డి–83 కింద ఉప కాలువ 27/ఎల్ ద్వారా అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని 24 గ్రామాలకు కాలువల ద్వారా సాగునీరందనుంది. ఇందులో పాలకుర్తి పరిధిలోని 1ఎల్ కాలువ నుంచి రాగినేడు, ఈసాలతక్కళ్లపల్లి, 2ఆర్ కాలువ నుంచి బ్రాహ్మణపల్లి, మర్రిపల్లి, రాయదండి, గోలివాడ, అంతర్గాం టేలాండ్ (చివరి)వరకు, 3ఆర్ కాలువ నుంచి ఆకెనపల్లి, బ్రాహ్మణపల్లి, సోమనపల్లి, ముర్మూర్ చివరి వరకు, 4ఆర్ కాలువ నుంచి ఆకెనపల్లి చివరి వరకు, 5ఆర్ ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, సోమనపల్లి, పొట్యాల చివరి భూములకు, 6ఆర్ ఎగ్లాస్‌పూర్, పొట్యాల చివరి వరకు, 7ఆర్ పొట్యాల చివరి వరకు, 8ఎల్ మద్దిర్యాల వరకు, 9, 10ఎల్ కాలువలు మద్దిర్యాల పునరావాస కాలనీలో ముంపునకు గురయ్యాయి.

ప్రత్యేక నిధులు కేటాయించారు



కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఎస్సారెస్పీ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు సరఫరా జరిగేలా కాలువలకు మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలను ఎస్సారెస్పీ కాలువల పనులకు కేటాయించాం. ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించారు.

– బైరి వేణుమాధవ్, ఎంపీడీవో, అంతర్గాం

పనులు పర్యవేక్షిస్తున్నాం

ఉపాధి హామీ నిధులతో ఎస్సారెస్పీ కాలువల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. సాగునీటి సరఫరాలో అంతరాయం కలిగే ప్రాంతాల్లో అత్యధిక కూలీలు కేటాయించారు. పనులను పర్యవేక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఎస్సారెస్పీ కాలువల పరిరక్షణకు పాటుపడుతున్నాం. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి చివరి ఆయకట్టుకు సాగునీరందనుంది.

– రమేశ్, ఏఈ, ఎస్సారెస్పీ



ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో చెత్త తరలించేందుకు గ్రామపంచాయతీ మల్టీపర్పస్ ఆటోట్రాలీని కొనుగోలు చేసింది. కొన్ని నెలలుగా ఆటో ట్రాలీ మొరాయించడంతో పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెలలు గడిచినా అధికారుల నిర్లక్ష్యంతో ఆటో ట్రాలీ మరమ్మతుకు నోచుకోవడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

మంథనిలో తిరంగా యాత్ర



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మంథని: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతసేన మన దేశ సత్తాను పాకిస్తాన్‌కు చూపించిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. మంథని పట్టణంలో బుధవారం రాత్రి తిరంగా యాత్ర నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. తిరంగా ర్యాలీలో రాజకీయ పార్టీలు, మతాలకు అతీతంగా జాతీయవాదులు, ఆపరేషన్ సిందూర్ మద్దతుదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు చల్లా నారాయణరెడ్డి, కొండపాక సత్యప్రకాశ్, బోగోజు శ్రీనివాస్, మల్క మోహన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతికుమార్, పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, మండలాధ్యక్షుడు విరవేన రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం



రథయాత్రలో నాయకులు

కాల్వశ్రీరాంపూర్: రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం బీసీ మేల్కొలుపు రథయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60శాతం జనాభా ఉన్న బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చే పెత్తనం ఇక చెల్లదని, బీసీలంతా ఐకమత్యంతో తిరగబడితే రాష్ట్రంలో బీసీ జెండా ఎగరవేయవచ్చన్నారు. తద్వారా బీసీ రిజర్వేషన్ అమలు చేసుకోవచ్చన్నారు. పల్లెపల్లెనా బీసీలు రాజకీయంగా ఎదగాలన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ, ఉద్యోగ రిజర్వేషన్లు అమలు చేసేవరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. బండ నిఖిల్, దాసరి ఉష, వివేక్ పటేల్, వడ్డేపల్లి మనోహర్, గుమ్మాల శ్రీనివాస్, జక్కని శ్రీకాంత్, కోరె కిరణ్, బండారి కొమురయ్య, మేర్గవేన సంపత్, కుమ్మరికుంట శారద, రవికుమార్, నవీన్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• గోవులను సంరక్షించాలి

సుల్తానాబాద్: గోవులను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ ప్రఖండ కార్యదర్శి కుమార్‌రెడ్డి కోరారు. తహసీల్దార్ బషీరోద్దీన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. గోరక్షక్ మెరుగు సిద్ధార్థ, మహేందర్ ఉన్నారు.

• మానవ అవయవాలపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం మానవ, జంతు అవయవాలపై మెడికల్ ఆఫీసర్ క్రిస్టియానా అవగాహన కల్పించారు. డీఈవో మాధవి, కోర్స్ డైరెక్టర్ కవిత, రిసోర్స్ పర్సన్స్ నరేశ్, కుమార్, సాధన, ప్రత్యక్ష, సీఆర్పీలు కిరణ్‌కుమార్, మంజుల, ఉపాధ్యాయులు ఉన్నారు.

• గుండెపోటుతో మాజీ సర్పంచ్ హఠాన్మరణం

ఓదెల: మండలంలోని జీలకుంట మాజీ సర్పంచ్ రౌతు శ్యాంరావు (52) గుండెపోటుతో మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. జమ్మికుంటకు పనిమీద వెళ్లిన శ్యాంరావు.. ఇంటికి రాగానే చాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే చికిత్స కోసం సుల్తానాబాద్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

• నీరుకుల్లలో చైన్ స్నాచింగ్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామ పరిధిలో బుధవారం మహిళ మెడలోంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని వెళ్లాడు. బాధితురాలు రమ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని మామిడి తోట వద్ద మామిడికాయలు అమ్ముతుండగా బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మామిడి కాయల ధర అడిగి ఫోన్ పే ఉందని అడగగా లేదని తెలపడంతో వెనక్కి వెళ్లి మళ్లీ వచ్చి బంగారు గొలుసు లాక్కెళ్లాడని తెలిపింది. దాదాపు రెండు తులాలు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పింది.

• వైద్య శిబిరానికి విశేష స్పందన

ముత్తారం: మండలంలోని కేశనపల్లిలో బుధవారం కరీంనగర్‌కు చెందిన సన్‌రైజ్ హాస్పిటల్ వారు నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, హాస్పిటల్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు ఆదేశాల మేరకు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 543మందికిపైగా వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. వైద్యులు రక్షిత, క్యాంపు మేనేజర్ రాజేందర్, కోఆర్డినేటర్ సతీశ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తిరుపతి, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు వినీత్, కుమార్, నవీన్ పాల్గొన్నారు.

• కాకా కుటుంబాన్ని విమర్శించే స్థాయి గజ్జెల కాంతంకు లేదు

ఓదెల: కాకా కుటుంబాన్ని విమర్శించే స్థాయి ప్రజాసంఘాల జేఏసీ నాయకుడు గజ్జెల కాంతంకు లేదని హరిపురం మాజీ ఎంపీటీసీ మాటూరి సరిత రవి అన్నారు. మండలంలోని హరిపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత నాయకుడినని చెప్పుకునే గజ్జెల కాంతం ఒక దళిత ఎంపీని తన పార్లమెంట్ పరిధిలోని సరస్వతి పుష్కరాల్లో ప్రొటోకాల్ లేకపోవటాన్ని ప్రశ్నించాల్సింది పోయి సమర్థించడం హేయమైన చర్య అన్నారు. కాకా కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

• కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్‌కు సన్మానం

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన కుంగ్‌ఫూ మాస్టర్ రాజమల్లును స్థానిక కుంగ్‌ఫూ మాస్టర్ లింగంపెల్లి రమేశ్‌తో పాటు శిక్షకులు బుధవారం సన్మానించారు. ఈ నెల 25న జరిగిన ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ యూనిట్ ఆఫ్ రాష్ట్ర ఎన్నికల్లో రాజమల్లు రాష్ట్ర కమిటీ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక శిక్షకులతో పాటు రమేశ్ ఆయనను సన్మానించారు.

• పాఠ్య పుస్తకాల పంపిణీ

రామగుండం: ప్రస్తుత విద్యా సంవత్సరం 2025–26కి గాను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తోంది. అంతర్గాం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం విద్యార్థుల సంఖ్య ఆధారంగా 1 నుంచి 10వ తరగతికి చెందిన పాఠ్య పుస్తకాలు అందజేశారు. గోలివాడ యూపీఎస్ ప్రధానోపాధ్యాయులు జొన్నల రవీందర్, పొట్యాల హైస్కూల్ పీడీ తిరుపతికి అంతర్గాం మండల విద్యా వనరుల కేంద్రం నిర్వాహకులు రేగొండ శ్రీధర్, సీఆర్పీ తీగుట్ల శ్రీనివాస్, వాణిశ్రీ పాఠ్య పుస్తకాలు అందజేశారు.

ఆర్జీ–3 ఏరియా ఎస్‌వోటూ జీఎంగా రామ్మోహన్



రిపోర్ట్ చేస్తున్న ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఎస్‌వోటూ జీఎంగా ఎం.రామ్మోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జీఎం కార్యాలయంలో జీఎం కొలిపాక నాగేశ్వరరావుకు రిపోర్ట్ చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచితంగా వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, ప్రభావిత ప్రాంత గ్రామాల నిరుద్యోగ యువతకు ఉచిత వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై, ఎంవీటీసీ మోడల్ 2 సర్టిఫికెట్, హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, మూడేళ్ల అనుభవం ఉన్న యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టీటీసీ ఆర్జీ–1 ఏరియాలో 12రోజుల పాటు థియరీ–ప్రాక్టికల్ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31లోగా ఆర్జీ–2 వీటీసీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజల కోసం పరితపించిన వ్యక్తి మునీర్



నివాళి అర్పిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజల కోసం పరితపించిన మునీర్, కార్మిక హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని టీబీజీకేఎస్ యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. యైటింక్లయిన్ కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మునీర్ సంస్మరణ సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీబీజీకేఎస్ ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, మాదాసి రామ్మూర్తి, రవి, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, శంకర్, సాంబయ్య, రమేశ్, చంద్రయ్య, తిరుపతి, సురేందర్, రవితేజ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: అపరిష్కృతంగా ఉన్న సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నేత మడ్డి ఎల్లాగౌడ్ కోరారు. ఆర్జీ–1 యాజమాన్యంతో బుధవారం నిర్వహించిన స్ట్రక్చరల్ సమావేశంలో పలు సమస్యలపై జీఎం లలిత్‌కుమార్‌తో మాట్లాడారు. ఆరునెలలుగా జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ప్రస్తావించిన అంశాలు, పరిష్కారమైన సమస్యల గురించి చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. నాయకులు రంగు శ్రీనివాస్, మహేశ్, మల్లికార్జున్ అశోక్, స్వామి, రాజు, అధికారులు గోపాల్‌సింగ్, కిరణ్‌బాబు, డీవీరావు, ఆంజనేయులు, చిలుక శ్రీనివాస్, రమేశ్, జితేందర్‌సింగ్, ధనలక్ష్మిబాయి, వీరారెడ్డి, వరప్రసాద్, రవీందర్‌రెడ్డి, హన్మంతరావు, శ్రావణ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ప్రత్యేక వంటకాలతో స్టాళ్ల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: అందరినీ ఆకట్టుకునేలా రాష్ట్ర వంటకాలతో కూడిన ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జూన్–2న పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేసి రుచికరమైన వంటలు అందుబాటులో ఉంచాలన్నారు. జీఎం కార్యాలయం నుంచి తెలంగాణ రన్, తెలంగాణ తల్లికి పూలమాల, అన్ని గనులు, విభాగాల్లో ఉదయం జాతీయ పతాకం ఎగరవేయాలని ఆదేశించారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు, ఎక్స్‌ప్లోరేషన్ ఏజీఎం శివనారాయణ, ఏజెంట్లు చిలక శ్రీనివాస్, రమేశ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఐటీ మేనేజర్ రాజేశ్, మేనేజర్లు డినిల్ కుమార్, రమేశ్‌కుమార్, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం కొలిపాక నాగేశ్వరరావు

రామగిరి: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లను బుధవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ రకాల స్టాల్స్, సభ ప్రాంగణం, అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లు, వేడుకలకు హాజరయ్యే వారికి ఇబ్బంది కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 2న జరిగే వేడుకలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్‌బాబు, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎలక్ట్రికల్ డీవైఎస్ఈ సంజీవ్‌కుమార్, అధికారులు సునీల్ ప్రసాద్, రాజేశం పాల్గొన్నారు.

సింగరేణి ప్యాసింజర్ రైలు రద్దుపై ఫిర్యాదు



సాక్షి కథనంతో ఎక్స్‌లో రైల్వేశాఖకు ఫిర్యాదు

రామగుండం: మహబూబాబాద్ వద్ద నిర్వహిస్తున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈనెల 29వ తేదీ వరకు రైల్వేశాఖ సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి భద్రాచలం రోడ్ సింగరేణి ప్యాసింజర్ రైలును రద్దు చేసింది. దీనిని పురస్కరించుకొని ఈనెల 24న సాక్షి దినపత్రికలో 'సింగరేణి రద్దుతో ఇబ్బందులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ స్పందించారు. కాగా 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని జోడిస్తూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులకు 'ఎక్స్' ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్‌ఎం స్పందిస్తూ 'సమస్యను మా దృష్టికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు. సింగరేణి రద్దుకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుంటాం' అని ఎక్స్‌లో సమాధానమిచ్చారు.

గొల్ల, కుర్మలకు ప్రాధాన్యమివ్వండి



వినతిపత్రం ఇస్తున్న మధుకర్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో, ప్రముఖ ఆలయాల పాలక మండలి నియామకాల్లో గొల్ల, కుర్మలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మధుకర్ యాదవ్ కోరారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రముఖ ఆలయాలు యాదగిరిగుట్ట, కొమురవెల్లి, ఓదెల మల్లికార్జునస్వామి తదితర ఆలయాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాల కల్పనకు కృషి



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: పట్టణ పరిధిలోని పూసాల శ్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. పూసాల శ్మశాన వాటికను బుధవారం ఆయన పరిశీలించారు. బోర్‌వెల్‌కు మరమ్మతు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చినట్లు తెలిపారు. శ్మశాన వాటిక చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను ట్రాక్టర్ సాయంతో తొలగించారు. శానిటరీ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.